

స్టడీ రూంలో విద్యార్థి ఆత్మహత్య!
» తునిలో కలకలం రేపిన సంఘటన 7
భార్యను కాపురానికి పంపడం లేదని కత్తితో దాడి 7
» తల్లీకూతుళ్లకు గాయాలు.. ఏలేశ్వరంలో ఘటన

అన్నవరాన.. ఆరుబయటే వసతి



కార్తీకపౌర్ణమి పర్వదినాన సత్యదేవుడి వ్రతం, దర్శనం కోసం మంగళవారం రాత్రికే వివిధ ప్రాంతాల నుంచి స్వామి సన్నిధికి భక్తులు వెల్లువలా తరలివచ్చారు. అన్నవరం దేవస్థానంలో సుమారు 450 గదులు మాత్రమే ఉండ డంతో అధికారులు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశారు. అయినా భక్తులు ఆసక్తి కనబరచక ఆలయప్రాంగణంలో సేదతీరారు.రాత్రి 10 నుంచి వ్ర తం టిక్కెట్లు విక్రయించి 1 గంట నుంచి వ్రతాలు ప్రారంభించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.
- అన్నవరం

నేడు సత్యదేవుడి గిరి ప్రదక్షిణ

7



సత్యదేవుడి గిరి ప్రదక్షిణ బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై అధికారులు మంగళవారం చర్చించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసులు, సిబ్బందిని ఆదేశించారు.

ఉప్పుడేమంటారో!



కరప మండలంలో సాల్ట్ భూములు

» జిల్లాలో 1,245 ఎకరాల సాల్ట్ భూముల అప్పగింతపై ఏమంటారో
» వీటి ధర తెలపాలని కోరిన చెన్నై డిప్యూటీ సాల్ట్ కమిషనర్
» తాజాగా ఎకరాకు రూ.6.50లక్షలు నిర్ణయించిన అధికారుల కమిటీ
» రూ.80.92కోట్లు చెల్లించేలా ప్రతిపాదనల నివేదిక పంపిన వైనం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 1,245 ఎకరాల ఉప్పు భూములను పారిశ్రామిక అవసరాలకు వినియోగించాలని భావిస్తున్న రాష్ట్రప్రభుత్వం వీటిని సాల్ట్ కమిషన్‌నుంచి తీసుకునే ప్రక్రియలో వేగం పెంచింది. ఈమేరకు అనేక తర్జన భర్జనలు, రిజిస్ట్రేషన్ల శాఖతో పలు మదింపుల తర్వాత ఎట్టకేలకు వీటికి ధర నిర్ణయించింది. ఎకరాకు రూ.6.50లక్షల చొప్పున జిల్లాఅధికారుల కమిటీ రేటు ఖరారు చేసింది. ఈమేరకు మొత్తం 1,245 ఎకరాలకు రూ.80.92కోట్లు చెల్లించడానికి అంగీకరించింది. ఈ మేరకు చెన్నైలోని డిప్యూటీ సాల్ట్ కమిషనర్‌కు చెల్లింపు ప్రతిపాదనల నివేదిక పంపించింది.ఈ ధరకు తమ భూములను రాష్ట్ర ప్రభుత్వ మారిటైం బోర్డుకు బదిలీ చేయడానికి సాల్ట్ కమిషన్ అంగీకరిస్తుందా? లేదా? అనేది తేలాల్సి ఉంది. కొన్ని నెలల కిందట కాకినాడ, కరప, తాళ్లరేవు మండలాల పరిధిలోని తమ భూములను స్వయంగా వచ్చి సాల్ట్ కమిషన్ పరిశీలించింది. బహిరంగ మార్కెట్‌లో ధరపై ఆరా తీసి వెళ్లింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారుల కమిటీ నిర్ణయించిన ధరపై ఏం నిర్ణయం తీసుకుంటుందనేది సస్పెన్స్‌గా మారింది.

పారిశ్రామిక అవసరాలకు..

జిల్లాలో కాకినాడ నగరం పరిధిలోని జగన్నాథపురంలో 117.65 ఎకరాలు, రూరల్ పరిధిలో గురజనాపల్లి, చొల్లంగి గ్రామాల్లో 626.37 ఎకరాలు, పెనుగుదురులో 501.26ఎకరాల ఉప్పు భూములున్నాయి. ఇవన్నీ చెన్నైలోని డిప్యూటీ సాల్ట్ కమిషన్‌కు చెందినవి. వీటిపై పూర్తి హక్కులు కమిషన్‌వే. వీటిని సాల్ట్ కమిషన్ ఎన్నోఏళ్లుగా ఎందుకూ వినియోగించకుండా ఖాళీగా వదిలేసింది. ఈనేపథ్యంలో వీటిని సేకరించి ఆ భూములను పారిశ్రామిక అవసరాలకు వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రం కాకినాడకు ఆనుకుని ఇవి ఉండడం, మరికొన్ని 216జాతీయరహదారిని ఆనుకుని ఉన్నాయి. దీంతో పలు కంపెనీలకు వీటిని కేటాయించి పారిశ్రామిక అవసరాలు తీర్చాలని భావిస్తోంది. దీంతో ఈ 1245.28 ఎకరాల భూములను తమకు విక్రయించాలని రాష్ట్రప్రభుత్వం కొన్ని నెలల కిందట చెన్నైలోని డిప్యూటీ సాల్ట్ కమిషనర్‌ను కోరింది. కమిషన్ వినియోగించనందున, రాష్ట్రప్రభుత్వ అధీనంలోని ఏపీ మారిటైం బోర్డుకు భూములను బదలాయించాలని కోరింది. దీంతో కమిషన్ స్పందించి ఆ భూములకు ధర ఎంత చెల్లిస్తారో తెలియజేస్తే సమ్మతి ప్రకారం మారిటైం బోర్డుకు భూములు అప్పగిస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ భూముల ధరను నిర్ణయించేందుకు రాష్ట్రప్రభుత్వం ఈఏడాది జూన్‌లో జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ కొన్ని నెలలుగా కరప, తాళ్లరేవు, కాకినాడ మండలాల పరిధిలోని ఉప్పు భూములను పరిశీలించింది. ఆయా మండలాల తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు వీటిని అధ్యయనం చేశారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ విలువ, ప్రభుత్వ ధరలను పరిగణనలోకి తీసుకుని కసరత్తు జరిపారు. ఈ మేరకు ఆ భూములకు ఎంత ధర చెల్లించవచ్చనేదానిపై పలు కోణాల్లో విశ్లేషించి జేసీకి నివేదిక అందజేశారు.వీటిని మరోసారి అధ్యయనంచేసిన కలెక్టర్ ఎట్టకేలకువీటికి ధర నిర్ణయించారు. ఉప్పు భూముల వినియోగం అనుకూలత, ప్రభుత్వధరలు, మార్కెట్ పరిస్థితులు అన్నీ కూలంకుషంగా చర్చించి ఎకరాకు రూ.6.50లక్షల ధర నిర్ణయించారు. మొత్తం 1,245.28 ఎకరాలకు రూ.80.92కోట్ల వరకు చెల్లించడానికి సమ్మతి ప్రకటించారు. ఈమేరకు జిల్లాస్థాయి అధికారుల కమిటీ నిర్ణయించిన ధరల ప్రతిపాదనలను చెన్నై డిప్యూటీ సాల్ట్ కమిషన్‌కు కాకినాడలోని సాల్ట్ సూపరింటెండెంట్ కార్యాలయ అధికారుల ద్వారా వివరించారు. గతంలో ఈభూముల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయి. సాల్ట్ కమిషన్‌నుంచి స్పందన లేక భూకేటాయింపులు నిలిచిపోయాయి.

ఏం చేస్తారో..

జిల్లాస్థాయి అధికారుల కమిటీ నిర్ణయించిన ధరపై ఇప్పుడు చెన్నైలోని డిప్యూటీ సాల్ట్ కమిషనర్ కార్యాలయం ఏం చేస్తుందనేది తేలాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఖరారు చేసిన ధరపై సాల్ట్ కమిషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ధర సరిపోతుందా? లేదా? అనేది తేల్చి చెప్పాల్సి ఉంది. ఈ భూములపై కొంతకాలం కింద చెన్నైనుంచి సాల్ట్ కమిషన్ కార్యాలయంనుంచి కొందరు అధికారులు పరిశీలన జరిపారు. చొల్లంగి, పెనుగుదురు ప్రాంతాల్లో పర్యటించి హైవేను ఆనుకునిఉన్న భూములు కావడంతో ధర భారీగా వస్తుందని అంచనా వేశారు. ఇప్పుడు ఎకరాకు రూ.6.50లక్షలు ఖరారుతో ఆ ధరకు సాల్ట్ కమిషన్ ఎలా స్పందిస్తుందనేది చూడాల్సిఉంది. సరిపోదు పెంచాలని కోరితే కొంత పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందా?అనేది అధికారుల కమిటీ తేల్చాలి. సాధ్యమైనంత తొందర్లోనే ధరకు సంబంధించి సాల్ట్ కమిషన్ నుంచి స్పష్టత రానుంది. ఉప్పు భూముల్లో పారిశ్రామికపార్కు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ల సదస్సులోను సాల్ట్‌భూములను కంపెనీలకు కేటాయించాలనే ప్రతిపాదన వచ్చింది.

టీచర్లకు.. పరీక్ష



ప్రభుత్వ ఉపాధ్యాయులకు తప్పనిసరి

» 2011 ముందు నుంచి అమలు
» రెండేళ్లలో ఉత్తీర్ణత అవకాశం
» 23 వరకు దరఖాస్తు గడువు
» డిసెంబర్ 10న పరీక్ష
» టెట్‌కు పెరిగిన డిమాండ్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

టెట్..టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్.. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టేవారందరూ తప్పనిసరిగా ఎదుర్కోవాల్సిన పరీక్ష..ఈ పరీక్ష పాసైతేనే.. పాఠాలు చెప్పేందుకు అర్హులు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలైనా.. ప్రైవేటు స్కూలైనా.. బడిలో పాఠాలు బోధించాలంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాల్సిందే. 2011కి ముందు ఉపాధ్యాయులుగా విధుల్లోకి చేరిన వారందరూ ఈ పరీక్ష రాయాల్సిందే. రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించాలి.. ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలివి. ఈ నిబంధనలతో ఉపాధ్యాయులు పరీక్షకు సన్నద్ధం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

23వరకు దరఖాస్తు గడువు

నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులతోపాటు ఈసారి ఇన్ సర్వీస్ టీచర్లకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) ఉత్తీర్ణత తప్పనిసరి చేయడంతో పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. ఈనెల 23వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంది. డిసెంబర్ 10న పరీక్ష ఉండడంతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. డిసెంబర్ 3 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 150 మార్కుల చొప్పున రెండు పేపర్లను రాయాలి. డిసెంబర్ 10వ తేదీ ఉదయం 9.30 నుంచి ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో సెషన్ ఇలా రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జనవరి 2న టెట్ కీ విడుదల చేయనున్నారు. తుది కీ జనవరి 13న ప్రకటించిన అనంతరం 19న టెట్ ఫలితాలను ప్రకటించనున్నారు.

పది వేల మందిపైనే పరీక్షకు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పది వేల మంది వరకూ ఇన్‌సర్వీస్‌లో ఉపాధ్యాయులు టెట్ రాయాల్సి ఉంటుంది. జిల్లాలో 6 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో సగం మందికి పైగా టెట్ రాయాల్సి ఉంది. 2012, 2014, 2018, 2025 నుంచి టెట్‌లో ఉత్తీర్ణులైన వారినే డీఎస్సీకి ఎంపిక చేస్తున్నారు. పేపర్-1, 2 క్వాలిఫై అయిన వారు మాత్రమే ఎంపికయ్యారు. 2011కు ముందు ఉద్యోగాల్లో చేరిన వారందరూ కచ్చితంగా టెట్ రాయాలి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాల, గురుకుల, మునిసిపల్ పాఠశాలల్లోను, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి ఇదో పెద్ద పరీక్షలా ఉంది. టెట్ ప్రకటనపై ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పరీక్షను ఎలా ఎదుర్కోవాలా అని 2011కి ముందు ఎంపికైన అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. 1994, 1996, 1998, 2000, 2001, 2002, 2003, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ రాయాలి.ఇదిలా ఉంటే 2030 ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ గ్రేడ్-2, హెచ్ఎం తదితర కేడర్ల ఉపాధ్యాయులకు ఈ టెట్ నుంచి మినహాయింపునిచ్చారు.ఉపాధ్యాయ సంఘాలు టెట్ అర్హతపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని సంఘాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు కోరుతూ కొంతమంది ఎమ్మెల్సీలు మంత్రి లోకేశ్‌ను కలిశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఎదురుచూస్తున్నారు.

160 ఎకరాల భూములు ఈడీకి అటాచ్!

» మనీలాండరింగ్ కేసులో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆస్తుల స్వాధీనం

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలోఉన్న అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన 160 ఎకరాలను ఈడీకి అటాచ్‌చేసినట్లు తెలిసింది. ఇటీవల అనిల్ అంబానీకి చెందిన ఆస్తులను మనీ ల్యాండరింగ్‌కేసులో ఈడీ అటాచ్‌చేస్తోంది. ఇందులోభాగంగా పెద్దాపురంలోఉన్న 160 ఎకరాలను అటాచ్ చేసినట్లు సమాచారం. కాగా ఈ భూములను కొన్నేళ్ల కిందట పవర్ ప్లాంటునిర్మాణంకోసం ఏపీఐఐసీ నుంచి రిలయన్స్ ఇన్‌ఫ్రా కొనుగోలు చేసింది. ఆస్తుల అటాచ్‌మెంట్‌పై కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా తమకు ఇంకా సమాచారం అందలేదని బదులిచ్చారు.

కాకినాడ కార్పొరేషన్ కమిషనరుగా సచ్చిదానంద వర్మ



కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ కమిషనరుగా సంగాని సచ్చిదానంద వర్మ (ఎస్ఎస్ వర్మ) రానున్నారు. ఈయన గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థలో ఫైనాన్స్ విభాగం అదనపు కమిషనరుగా మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వర్మ ఈనెల 10వతేదీ తర్వాత బాధ్యతలు తీసుకోనున్నట్టు తెలిసింది.

జిల్లాలో నిఘా మరింత పటిష్టం

» పోలీసుశాఖకు రూ.10లక్షల విలువైన సీసీ కెమెరాల వితరణ
» ఎస్పీకి అందజేసిన కోరమాండల్ ప్రతినిధులు



ఎస్పీకి సీసీ కెమెరాలు అందజేస్తున్న కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ ప్రతినిధులు

కాకినాడ క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ సాంకేతిక సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రైవేటుసంస్థల సహకారం ఎంతో అవసరమని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. కాకినాడజిల్లా పోలీసు వ్యవస్థలో భద్రతను, పర్యవేక్షణను బలోపేతం చేసేందుకు సాంకేతిక ఆధునికతను పెంపొందించేందుకు కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ రూ.10లక్షలు విలువైన 99 సీసీ కెమెరాలను సమకూర్చింది. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటితోపాటు అదనంగా 94 హెల్మెట్‌లను ఆ సంస్థ ప్రతినిధులు ఎస్పీ బిందుమాధవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలను ఇన్‌స్టాల్ చేస్తామని, ఇవి ప్రజా భద్రత పరిరక్షణలో కీలక సాధనాలన్నారు. కోరమాండల్ సంస్థకు పోలీసుశాఖ తరఫున ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సాంకేతిక మద్దతు కార్యక్రమాలను మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ సీనియర్ ఏవీపీ, యూనిట్ హెడ్ కె.జగన్నాథన్, జీఎం(హెచ్‌ఆర్) పురుషోత్తం పద్మనాభం, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జీవీ సాయికృష్ణ, ఏజీఎం (హెచ్‌ఆర్) కె.వంశీకృష్ణ, ఎస్.లక్ష్మీనారాయణ, వి.శ్రీను, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్‌పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాత్కాలిక ఆనందం కోసం తప్పుడు మార్గాలను ఎంచుకోవద్దు

» ఎస్పీ బిందుమాధవ్
» సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద్, ఎస్పీ బిందుమాధవ్

జేఎన్టీయూకే, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మీ భవిష్యత్-మీ చేతుల్లోనే ఉందని, తాత్కాలిక ఆనందంకోసం తప్పుడు మార్గాలను ఎంచుకోవద్దని ఉందని విద్యార్థులకు ఎస్పీ జి.బిందుమాధవ్ సూచించారు. జేఎన్టీయూకే అలూమ్ని ఆడిటోరియంలో జేఎన్టీయూకే, యూసీఈకే ఎన్ఎస్ఎస్ యూనిట్లు, పోలీసుశాఖ సంయుక్తంగా మత్తు పదార్థాల దుర్వినియోగం, సైబర్, మహిళలపై జరిగే నేరాలకు సంబంధించి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్, జేఎన్టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్‌పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణ, సైబర్ నేరాలపై అవగాహనతో ముందుకు సాగితేనే సురక్షిత సమాజాన్ని నిర్మించగలమన్నారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏఎస్పీ పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను సమాజ అభివృద్ధికి వినియోగించాలి కానీ నేరాలకు సాధనంగా మార్చకూడదన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుర్వినియోగంపై రూపొందించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సదస్సులో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డైరెక్టర్లు, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇకపై క్షణాల్లో..

» సులభంగా, వేగంగా విద్యుత్ కనెక్షన్ మంజూరు 6
» కొత్త విధానానికి శ్రీకారం చుట్టిన ఈపీడీసీఎల్

పీఎఫ్ చందా సొమ్మును ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి

» పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉద్యోగులకు 11వ పీఆర్సీ అమలు చేసిన సమయంలో 2022లో మినహాయించిన పీఎఫ్ చందా సొమ్మును పీఎఫ్ ఖాతాలకు జమ చేయాలని పీఆర్టీయూ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బండి నూకరాజు కోరారు. మంగళవారంవారు ఈ మేరకు కాకినాడలో జడ్పీ డిప్యూటీ సీఈవో శంకర్ గోపాల్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు తుది చెల్లింపులు పూర్తిచేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న 2022 పీఎఫ్ చందా సొమ్మును కూడా ఇప్పుడు వారి ఖాతాలకు జమ చేయాలని కోరామన్నారు. ప్రభుత్వం విడుదల చేసినందున తక్షణం జమ చేస్తామని డిప్యూటీ సీఈవో హామీ ఇచ్చారన్నారు.

సామర్లకోటలో డీఈవో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థుల మేథస్సును పరిశీలిస్తున్న డీఈవో రమేష్

సామర్లకోట,నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలతోపాటు మున్సిపల్ ఉన్నత పాఠశాలలను డీఈవో పి.రమేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీడింగ్ ఎబిలిటీ, గణితంలో ఫోర్‌ఫండమెంటల్ ఆపరేషన్స్ అంశాల్లో విద్యార్థుల మేథస్సును డీఈవో స్వయంగా పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నా వారు ఆయా సబ్జెక్టుల్లో పూర్తిగా వెనుకబడి ఉండడంపై విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షల్లో అధమ ఫలితాలు నమోదు చేసుకున్న ఎస్టీజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలకు డీఈవో వెళ్లారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని హెచ్ఎంలను ఆదేశించారు. పట్టణంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను డీఈవో రమేష్ పరిశీలించారు. ఆయన వెంట డీసీఈబీ సెక్రటరీ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఈవో పట్టపగలు పుల్లయ్య ఉన్నారు.





నూతన విద్యుత్ సర్వీసుల జారీకి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సరికొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. పారదర్శకత పెంచి వినియోగదారులకు సత్వర సేవలందించేందుకు ఏపీఈఆర్‌సీ నియమావళికి అనుగుణంగా విద్యుత్ సర్వీసు జారీలో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వేగంగా, సులభంగా పొందాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'ఈజ్ ఆఫ్ లివింగ్' కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నారు.

ఇకపై క్షణాల్లో...

- సులభంగా, వేగంగా విద్యుత్ కనెక్షన్ మంజూరు
- కొత్త విధానానికి శ్రీకారం చుట్టిన ఈపీడీసీఎల్
- దరఖాస్తు సమయంలోనే స్థిర చార్జీల నిర్ణయం
- రాష్ట్రంలోనే తొలిసారిగా అమలు

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

విద్యుత్ సర్వీసుల జారీ ప్రక్రియను సులభతరం చేయడం, చార్జీల అమలులో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నిబంధనలు-2020కు అనుగుణంగా ఏపీఈఆర్‌సీ-2013 నాటి విధానాల్లో అవసరమైన సవరణలు చేసింది. కొత్త విద్యుత్ సర్వీసు జారీకి ఇప్పటివరకు దరఖాస్తు స్వీకరించిన తర్వాత స్థల పరిశీలన చేసి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీసు లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ ప్రక్రియ మొత్తం ఆధారపడి ఉండేది. అందుకు కొంత సమయం పట్టేది. ఇప్పుడు కొత్త విధానంలో ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్లు, అంచనాల తయారీ లేకుండా వేగవంతమైన సేవలతో సర్వీసు చార్జీలపై వినియోగదారులు ముందుగానే స్పష్టమైన అవగాహన పొందుతారు.

150 కిలోవాట్ల వరకు ఉన్న కనెక్షన్‌కు స్థిర (ఫిక్స్‌డ్) చార్జీ ఉంటుంది. ఒక కిలోమీటరు పరిధిలో ఇప్పటికే విద్యుదీకరణ పూర్తయిన ప్రాంతాల్లో 150 కిలోవాట్ల వరకు లోటెన్షన్, హైటెన్షన్ కనెక్షన్లలో, 75 కిలోవాట్లకు పైగా 150 కిలోవాట్ల వరకు కోరే వినియోగదారులు ఈ చార్జీలకు అర్హులవుతారు. అయితే ఒక కిలో మీటరు దూరానికి మించి ఉన్న ప్రాంతాలు, కొత్త లే-ఔట్ల విద్యుదీకరణ, వ్యవసాయ, అనుబంధ కనెక్షన్లు, అండర్‌గ్రౌండ్ కేబులింగ్ అవసరమయ్యే సందర్భాల్లో ఈ చార్జీలు వర్తించవు. దరఖాస్తు రుసుము, సెక్యూరిటీ డిపాజిట్ తదితర రుసుములు ప్రస్తుత నియమావళి ప్రకారం కొనసాగుతాయి.

పాత విధానంలో ఇలా...

ఇది వరకు కొత్త విద్యుత్ సర్వీసుల జారీకి దరఖాస్తు చేసిన తర్వాత సైట్ ఇన్‌స్పెక్షన్, ఎస్టిమేట్ తయారీ వంటి ప్రక్రియల ద్వారా కనెక్షన్ చార్జీలను నిర్ణయించేవారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు వినియోగదారుడికి ఎంత మొత్తం చెల్లించాలి అనేది స్పష్టంగా తెలిసేది కాదు. ఎస్టిమేట్‌పై ఆధారపడి సర్వీసు లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. ఈ ప్రక్రియలో దూరం, ప్రాంతం, లోడ్ వంటి అంశాలపై చార్జీలు మారుతూ ఉండేవి.

కొత్తగా అమలులోకి వచ్చిన విధానంలో 150 కిలోవాట్ల వరకు ఉన్న అన్ని కొత్త కనెక్షన్లకు అదనపు లోడ్‌లకు కేటగిరీ ఆధారంగా స్థిర చార్జీలు నిర్ణయించారు. ఇప్పుడు సైట్ ఇన్‌స్పెక్షన్ లేదా ఎస్టిమేట్ అవసరం లేకుండా దరఖాస్తు సమయంలోనే వినియోగదారుడు చెల్లించాల్సిన మొత్తం స్పష్టంగా తెలుస్తుంది. తద్వారా సర్వీసు జారీ ప్రక్రియ వేగవంతమవుతుంది. డెవలప్‌మెంట్ చార్జీ, సర్వీస్‌లైన్ చార్జీ కలిపి స్థిర చార్జీ నిర్ణయించడంతో ఎటువంటి అదనపు చార్జీ వసూలు చేయట్లేదు. ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న వినియోగదారులందరికీ ఒకే రకమైన చార్జీలు వర్తిస్తాయి. 20 నుంచి 150 కిలోవాట్ల వరకు రూ.12,600 చొప్పున, హెచ్‌టీ 75-150 కిలోవాట్ల వరకు రూ.4,400 వసూలు చేస్తారు.



వినియోగదారులకు వెసులుబాటు

అల్లంరాజు వీఎన్‌డీఎస్ ప్రభాకర్
ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు, పెద్దాపురం

కొత్త విద్యుత్ సర్వీసుల జారీ ప్రక్రియను సులభతరం చేయడం ఈ విధానం ప్రధాన ఉద్దేశ్యం. స్థిర చార్జీలను ముందుగానే నిర్ణయించడంతో ఎస్టిమేట్ తయారీలో ఎటువంటి జాప్యం ఉండదు. ఎవరికి ఎంత లోడ్ అవసరం అవుతుందో లెక్కించుకుని ఆ మేరకు విద్యుత్ కనెక్షన్‌కు చార్జీలు చెల్లించాలి. పారదర్శకతతో పాటు వేగవంతంగా సేవలందుతాయి. విద్యుత్ వినియోగదారులు సమయాన్ని వృథా చేసుకోకుండా కనెక్షన్ పొందవచ్చు.

మహిమాన్విత క్షేత్రం

కుండలేశ్వరం

- వృద్ధ గౌతమి నదీ తీరాన కొలువైన కుండలేశ్వరుడు
- గౌతమ ముని ప్రతిష్ఠించినట్టు పురాణాల్లో ప్రస్తావన
- క్షేత్ర మహత్యాన్ని చాటిచెప్పిన ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు
- ఇటీవలి కాలంలో ఆలయానికి పెరిగిన భక్తుల తాకిడి


విశేష అలంకరణలో కుండలేశ్వర స్వామి

(కాట్రేనికోన-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో వృద్ధ గౌతమి నదీ తీరాన కుండలేశ్వరుడు కొలువై ఉన్న మహిమాన్విత క్షేత్రం కుండలేశ్వరం. 15వ శతాబ్దంలో మహాకవి శ్రీనాథుడు ఈ క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించాడు. విరూపాక్షుడే కుండలేశ్వరుడని కాశీ ఖండములోను, 'కోటిపల్లి శుకేమలాంఘ్రులకు మ్రొక్కి కుండలాముఖ తీర్థంబు గురించి గౌతమి, గంగ లవణాబ్ధిగొగలించె' అని భీమఖండంలోను వర్ణించారు. బ్రహ్మాండ పురాణంలో వ్యాస మహర్షి ఈ క్షేత్రం గురించి వివరించారు. శంకరాచార్యకృతమైన చంద్రశేఖరాష్టకంలో కుండలేశ్వరుని మార్కండేయుడు ధ్యానించినట్టు శ్లోకాలున్నాయి.

- పురాణాల్లో కుండలేశ్వర పుణ్య క్షేత్ర ప్రస్తావన ఉంది.
- కుండలం ఆకారంలోని శివలింగాన్ని గౌతమ ముని ఇక్కడ ప్రతిష్ఠించినట్టు చెప్తారు.
- ఈ క్షేత్ర నదీగర్భం కుండల తీర్థంగా ప్రసిద్ధి గాంచింది.
- అర్ధరాత్రి వేళ ఇక్కడ ఓంకార నాదాలు వినిపిస్తాయని స్థానికులు చెప్తున్నారు.
- ఆలయ గోపురంలో 23 శివలీలల విగ్రహ మూర్తులు ఉండడం విశేషం.
- కార్తీక మాసం, మహా శివరాత్రి పర్వదినాలే కాకుండా మిగిలిన రోజుల్లో కూడా భక్తులు గణనీయంగా రావడం విశేషం. టూరిస్టు వాహనాలు సైతం క్యూ కడుతున్నాయి. దీంతో ఆలయంలో భక్తుల కోసం పలు చర్యలు చేపట్టారు. కార్తీక మాసంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది.



కుండలేశ్వర క్షేత్రం దర్శనం అనంతరమే కాశీ రావాలని పండితులు తనతో చెప్పినట్టు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తన కాశీయాత్ర అనుభవాలను కుండలేశ్వరంలో వివరించారు. ఆయన తన ప్రవచనాల్లో కుండలేశ్వర క్షేత్రం గురించి స్థానికులకు తెలియని ఎన్నో అంశాలను ప్రస్తావించారు. తాము తరచూ కుండలేశ్వరం వచ్చి గౌతమి నదిలో స్నానమాచరించి కుండలేశ్వరుని దర్శించుకుంటామని అక్కడ పలువురు మహా పండితులు తనకు వివరించినట్టు చాగంటి తన మనసులోని మాటను భక్తులతోపంచుకున్నారు. అంతే కాదు ఆయన సొంత నిధులతో కుండలేశ్వరంలో పలు నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల భక్తులు వేలాదిగా తరలి వస్తున్నారు.

- భక్తుల తాకిడి పెరగడంతో దేవదాయ శాఖ అధికారులు ఈ ఆలయంపై దృష్టి సారించారు. ఉప కమిషనరు, ఈఈ, డీఈఈ, స్థపతి, జిల్లా అధికారులు కుండలేశ్వర క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు.


ఆలయ గోపురంపై శివలీలలు చాటే విగ్రహాలు


రజత జటాఝూట అలంకరణలో కుండలేశ్వరస్వామి


కుండలేశ్వరంలోని పుష్కర ఘాట్

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- కొత్త కాంట్రాక్టర్‌కు పనులు
- ముందుగా అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్లు నిర్మాణం
- కాంట్రాక్టర్‌తో చర్చించిన కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నరగా నిలిచిపోయిన జొన్నాడ ఫ్లైఓవర్ పనులకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. పాత కాంట్రాక్టును రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్‌ను నియమించడంతో మంగళవారం పనులకు శ్రీకారం చుట్టారు. వారం రోజుల వ్యవధిలో ముందుగా అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్లను నిర్మించనున్నారు. దాదాపు మూడేళ్ల క్రితం నిర్మాణానికి జొన్నాడ, రాజమహేంద్రవరంలలో ఫ్లైఓవర్లు నిర్మించడానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. అయితే 2024 ఏప్రిల్ నాటికి రాజమహేంద్రవరం పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ జొన్నాడ ఫ్లైఓవర్ పనులు మాత్రం నత్తనడకగా సాగించారు. అయితే 2024 సాధారణ ఎన్నికల అనంతరం పనులు పూర్తిగా నిలుపుదల చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులు రివ్యూ చేసినప్పటికీ ఈ వారంలో మొదలు పెడతామని మభ్యపెట్టారు. సెప్టెంబరు నెలలో రాష్ట్రస్థాయిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, అంతకు ముందుగానే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణం పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని సూచించారు. ఈ మేరకు కొత్తగా కాంట్రాక్టు ఖరారు చేశారు.


జొన్నాడలో కాంట్రాక్టర్‌తో చర్చిస్తున్న ఆర్డీవో శ్రీకర్

కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత

కొత్తగా నిర్మాణ బాధ్యతలు స్వీకరించిన కాంట్రాక్టు ప్రతినిధి సురేష్‌కు మంగళవారం బాధ్యతలు అప్పగించారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, ఆలమూరు తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, టీడీపీ నాయకుడు సలాది నాగేశ్వరరావు తదితరులు జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించి తక్షణం సర్వీసు రోడ్లను బాగు చేయాలని సూచించారు. దాంతో వారం రోజుల వ్యవధిలో నిర్మించనున్నట్టు సురేష్ వివరించారు.

జూన్ నాటికి 5,6 యూనిట్లు సిద్ధం

- సీలేరు కాంప్లెక్స్ సీఈ రాజారావు
- పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో రూ.510 కోట్లతో పనులు
- వర్షాలతో నిలిచిన వైనం

మోతుగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎడ తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో రూ.510 కోట్లతో నిర్మిస్తున్న 5,6 యూనిట్ల పనుల్లో రెండు నెలలపాటు జాప్యం చోటు చేసుకుంది. జెన్కో సీఎండీ ఆదేశాలతో రెండు యూనిట్ల నిర్మాణం పూర్తయ్యే వరకు రేయింబవళ్లు పనులు చేయనున్నట్టు సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీరు రాజారావు తెలిపారు.. ప్రస్తుతం నాలుగు యూనిట్ల ద్వారా 460 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. 5, 6 యూనిట్ల నిర్మాణం పూర్తయితే అదనంగా 230 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చన్నారు. 2026 మార్చి నెలాఖరుకు ఐదో యూనిట్, జూన్ నెలాఖరుకు ఆరో యూనిట్ పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఇప్పటికే పెనస్టాక్ పనులు 70 శాతం, పవర్ హౌస్ ఇన్‌సైడ్ సివిల్ పనులు 60శాతం, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు 40 శాతం పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం పవర్ కెనాల్ ద్వారా ఫోర్బే జలాశయానికి వచ్చే నీటితో ఆరు యూనిట్లలో పీక్ అవర్స్‌లో రెండు, మూడు గంటలపాటు విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఆరు యూనిట్ల ద్వారా నిరంతరం విద్యుదుత్పత్తి చేయాలంటే ప్రస్తుతం ఉన్న పవర్ కెనాల్ పక్కన మరో పైప్లాన్ నిర్మించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం రోజుకు ఏడు నుంచి ఎనిమిది మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. బలిమెల జలాశయంలో మన వాటాగా 62.9 టీఎంసీల నీరు, డొంకరాయి జలాశయంలో 12.7 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. రానున్న రోజుల్లో తాగునీటికి, విద్యుదుత్పత్తికి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

కాకినాడలో ట్రైనింగ్ హబ్‌కు ప్రతిపాదనలు


కలెక్టర్ షాన్‌మోహన్‌తో సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ క్యాంపస్ హెడ్ మెర్లిన్, చిత్రంలో పీడీ లచ్చారావు

కాకినాడ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ(ఇండియా) ద్వారా కాకినాడలో ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని ఆ కంపెనీ క్యాంపస్ హెడ్ మెర్లిన్ మంగళవారం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి తమ ప్రతిపాదనలను వివరించారు. ఈ సందర్భంగా మెర్లిన్ మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా విద్యార్థులు ఇన్నోవేటివ్ ఐడియాలజీ ద్వారా వివిధ ప్రాజెక్టులను తయారు చేయడానికి 60 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కంపెనీలోనే ఏడాదికి రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు జీతంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు. మూడు ట్రైనింగ్ సెంటర్లతో పాటు ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి కాకినాడను ట్రైనింగ్ హబ్‌గా తయారుచేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఇందుకు కలెక్టర్ షాన్‌మోహన్ సానుకూలంగా స్పందించి శిక్షణకు కావల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. శిక్షణ చేపడుతున్న వికాస పీడీ లచ్చారావును అభినందించారు. మేనేజరు పి.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు రోజిలి ఎంపిక



కోరుకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల జడ్పీ హైస్కూల్ ప్లస్ పాఠశాల పదో తరగతి విద్యార్థిని ములగలేటి రోజిలి జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం జేబీఎస్ శ్రీనివాస్ తెలిపారు.ఇటీవల కొవ్వూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు చెప్పారు. ఈ నెల 11నుంచి 14వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే పోటీల్లో రోజిలి పాల్గొననుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణితో పాటు వ్యాయామోపాధ్యాయుడు కేవీ సత్యనారాయణరావులను డీఈవో కె.వాసుదేవరావు,ఎంఈవోలు కుశలవ దొర, సుజాత, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కర్రి రమేష్ తదితరులు అభినందించారు.

ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ శాస్త్రీయ సలహా మండలి సమావేశాలు


మండలి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ) శాస్త్రీయ సలహా మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలకు వివిధ విశ్వవిద్యాలయాల మాజీ వైస్ చాన్సలర్లు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య పంటలైన పొగాకు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటల భవిష్యత్ ప్రణాళికల కోసం శాస్త్రీయ సలహాలు,సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తానూ రైతు కుటుంబం నుంచే వచ్చానన్నారు. సుమారు 29ప్రాజెక్టులు బయట మూలాల నుంచే స్పాన్సర్ అయ్యాయని వీటిలో 34శాతం రెవెన్యూ ఇస్తున్నాయని సంస్థ డైరెక్టర్ శేషుమాధవ్‌ను అభినందించారు.దేశంలో పొగాకు విత్తన అవసరాలను ఎన్ఐఆర్‌సీఏ మాత్రమే రైతులకు అందిస్తోందన్నారు.సంస్థ ఇతర వాణిజ్య పంటలను మేళవించి సత్ఫలితాలతో రూపాంతరం చెందడం సంతోషంగా ఉందన్నారు.భవిష్యత్‌లో పొగాకు పంట బ్యాన్ చేసే అవకాశం వుందని అందువల్ల వాణిజ్య పంటల్లో ప్రత్యామ్నాయ సాగు పట్ల పరిశోధనలు చేపట్టాలన్నారు.కె.సరళ, ఎలికే ప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ రెజ్లింగ్ పోటీలకు

ముగ్గురు పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

కాకినాడ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ పోటీలకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఆదికవి నన్నయ యూనివర్శిటీలో ఇటీవల నిర్వహించిన యూనివర్శిటీ కాలిజియేట్ రెజ్లింగ్ పోటీల్లో 46 కిలోల విభాగంలో పీఆర్ కాలేజీ బీఎస్సీ విద్యార్థిని ఎం.జాహ్నవి, 59 కిలోల విభాగంలో బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థిని ఎన్ఏ ప్రణతి, 76 కిలోల విభాగంలో పి.తనిష్క, బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ ముగ్గురు ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టీమ్‌లో స్థానం సాధించారని, ఈ నెల 27 నుంచి రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి ఎస్‌వీవీఎల్‌జీ వర్మ, డీవీ రమణ, కె.దుర్గారావు, శ్రీనులను ప్రత్యేకంగా అభినందించారు.

సహకార చట్టం మేరకు సొసైటీల్లో తనిఖీలు

డీసీసీబీ చైర్మన్ రామస్వామి


సూపర్‌వైజర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల చట్టం ప్రకారం సొసైటీల్లో తనిఖీలు చేయాలని రైతులకు ప్రతీ రుణాన్ని అందేటట్టు చూడాల్సిన బాధ్యత డీసీసీబీ సూపర్‌వైజర్లకు ఉందని చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)సూచించారు.కాకినాడ డీసీసీబీ సమావేశ హాల్లో రాష్ట్ర సహకార యూనియన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీసీబీ ఉద్యోగులకు త్రైమాసిక తనిఖీలపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తుమ్మల బాబు మాట్లాడుతూ సొసైటీల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, రికవరీపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎన్‌పీఏ తగ్గించాలన్నారు. రైతులు, సొసైటీల నుంచి వచ్చే ఫిర్యాదులపై సరైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సహకార వారోత్సవాల సందర్భంగా 4నెలల పాటు క్షేత్రస్థాయిలోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో పి.ప్రవీణ్ కుమార్, డీజీఎం శ్రీధర్ చౌదరి, డీఎల్‌సీవో పీబీఎన్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి సహకార శిక్షణాధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7న కాకినాడలో జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఇసుజు మోటార్స్ కంపెనీలో పనిచేయడానికి కాకినాడ ఐటీఐలో ఈ నెల 7న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రధానాధికారి ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ 2022 నుంచి 2025లోపు ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. ఆసక్తిగల వారు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

పారా స్విమింగ్ చాంపియన్‌షిప్‌లో సచివాలయ ఉద్యోగి విజయం



కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏలూరులో జరిగిన 7వ ఏపీ పారా స్విమింగ్ చాంపియన్‌షిప్-2025లో కాకినాడ సచివాలయానికి చెందిన ఉద్యోగి లంక నాగేశ్వరరావు ప్రతిభ కనబరిచి రెండు పతకాలు సాధించారు. కాకినాడ డ్రైఫిష్ మార్కెట్ సచివాలయంలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వరరావు, ఈ చాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభతో మెడల్స్ సాధించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయలంలో ఇన్‌చార్జి కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావులను నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి మెడల్స్‌ను ప్రదర్శించారు.ఈ సందర్భంగా వారు నాగేశ్వరరావును అభినంచారు.

నేడే వేడుక..


గతేడాది గిరిప్రదక్షిణకు విచ్చేసిన అశేష భక్తజనం (ఫైల్‌ఫొటో)

- సత్యదేవుడి రాక కోసం ఎదురుచూస్తున్న రత్న, సత్యగిరులు
- స్వామివెంట గిరిప్రదక్షిణలో పాల్గొననున్న రెండు లక్షల మంది భక్తులు
- సుమారు 8.5 కిలోమీటర్ల గిరియాత్ర
- ఉదయం 8 గంటలకు పల్లకీసేవ, మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథంతో గిరిప్రదక్షిణ
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తం చేసిన ప్రభుత్వం

అన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి కోసం రత్నసత్యగిరి కొండలు ఎదురుచూస్తున్నాయి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామి వెంట నడిచే భక్తుల గోవిందనామస్మరణలతో పులకరించపోనున్నాయి. ఈ ప్రత్యేక కార్యక్రమాలకు కార్తీక పౌర్ణమి పర్వదినం ముఖ్య వేదిక కానుంది. ఏటా కార్తీకపౌర్ణమి నాడు కాకినాడ జిల్లా అన్నవరంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది. బుధవారం కార్తీకపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని గిరిప్రదక్షిణ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 8గంటలకు తొలిపావంచా వద్ద నుంచి స్వామివారి పల్లకీలో బాజాభజంత్రీలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ జాతీయరహదారి మీదుగా బెండపూడి పుష్కరకాలువ మీదుగా జరిగే గిరిప్రదక్షిణ యాత్ర సుమారు 8.5 కిలోమీటర్ల మేర సాగనుంది. ఇటీవల కాశీబుగ్గ ప్రమాద ఘటన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగాన్ని దేవదాయశాఖ అధికారులను ఆదేశించింది. దీనిలో భాగంగా ఇప్పటికే కాకినాడ జిల్లా ఎస్పీ గిరిప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. దేవదాయ శాఖ ప్రత్యేక అధికారిగా నియమించిన త్రినధరావు అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్ ఇతర అధికారులతో గిరిప్రదక్షిణ రోడ్డు, అక్కడ భక్తులకు కల్పించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 2లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనాతో దానికణుగుణంగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

12 చోట్ల పళ్లు, మజ్జిగ పంపిణీకి స్టాల్స్

12చోట్ల భక్తులకు పులిహోర, మజ్జిగ, పళ్ల స్టాల్స్‌ను దాతల సహకారంతో పంపిణీ చేయనున్నట్టు అధికారులు వివరించారు. పల్లకీ, సత్యరథం వెంబడి రోప్‌పార్టీతో బందోబస్తు చేపట్టనున్నారు. రథం జాతీయ రహదారిపైకి చేరే సమయంలో అరగంట ముందు భారీవాహనాలను నిలుపుదల చేసి చిన్నవాహనాలకు వన్‌వే ద్వారా మళ్లించాలని నిర్ణయించారు. ఎక్కడికక్కడ సైన బోర్డులు ఏర్పాటుచేయాలని, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా భక్తులకు మార్గదర్శక సమాచారం ఇవ్వాలని కాకినాడ ఎస్పీ అధికారులకు సూచించారు.

భారీ బందోబస్తు

ఇన్‌చార్జి ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు దేవస్థానం సిబ్బంది కాకుండా 724మంది పోలీసులు, 8 మంది సీఐలు, 16మంది ఎస్‌ఐలు, ఆరుగురు ఎమ్మార్వోలు, 20మంది వీఆర్వోలు భక్తులకు సేవలందిస్తారని తెలిపారు. గిరిప్రదక్షిణకు ప్రత్యేకాధికారిగా నియమించిన త్రినాధరావు దేవస్థానం సిబ్బందితో సమావేశమయ్యారు. ఉదయం, మధ్యాహ్నం గిరిప్రదక్షిణతో పాటుగా సత్యదేవుడి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఏర్పాట్లపై చర్చించారు. 1500 వ్రతాల నిర్వహణకు ప్రధానాలయం పక్కనే ఉన్న ప్రాకారం వద్ద అదనపు మండపాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సాయంత్రం పంపా హారతులు, జ్వాలా తోరణం, కార్యక్రమాలన్నీ నిర్దేశించిన సమయానికి జరపాలని వైదిక కమిటీకి సూచించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ, ఈవో, చైర్మన్

సాలీడు... బాగుంది గూడు!





సాలీడులు అందంగా అల్లుకోవడం చూస్తూ ఉంటాం... కాకినాడ జిల్లా ఇంద్రపాలెం- సామర్లకోట రోడ్డులో మంగళవారం తెల్లవారుతుండగా... మంచుకురిసే వేళలో.. సాలీడు అందంగా అల్లుతున్న ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా...

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

కపిలేశ్వరపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసులో నిందితుడు షేక్ గౌస్ మొహిద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రామచంద్రపురం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు అంగర ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కపిలేశ్వరపురం మండలం నల్లూరుకి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన షేక్ గౌస్ మొహిద్దీన్ లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణపై వారంరోజుల క్రితం పోక్సో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా డీఎస్పీ రఘువీర్ ఆదేశాలతో నిందితుడిని అరెస్ట్ చేసి రామచంద్రపురం కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

వ్యక్తి మృతి కేసులో మహిళ అరెస్ట్

రాజమహేంద్రవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రైల్వే స్టేషను సమీపంలోని జీఎస్‌ఆర్ లాడ్జిలో ఇటీవల ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆ కేసులో మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ శివగణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధవళేశ్వరానికి చెందిన ఉసురుమర్తి ధర్మరాజుకు విశాఖపట్నానికి చెందిన సత్య అనే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో లాడ్జిలో ధర్మరాజు మృతి చెందాడు. తొలుతగా అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శవపరీక్ష, మృతుడి శరీరంపై గాయాల ఆధారంగా హత్యగా కేసుగా మార్పు చేశారు. ఈ కేసులో నిందితురాలైన సత్యను అరెస్టు చేశామని సీఐ శివగణేశ్ తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

అంబాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన వ్యాపారి కాసు శ్రీనివాసరావు (60) సోమవారం తన పొలంలో గడ్డి మందు తాగాడు. విషయాన్ని అల్లుడు శ్యామ్‌సుందర్‌కు ఫోన్ వివరించగా బంధువుల సాయంతో అమలాపురంలోని ఆసుపత్రిలో చేర్పించారు. అయితే పరిస్థితి విషమించడంతో కాకినాడలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతిచెందిన్నట్టు పోలీసులు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ మూర్తి తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆదాయం రూ.37.23 లక్షలు

పెద్దాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయంలోని హుండీల్లో కానుకలను మంగళవారం లెక్కించారు. 126 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.27,76,638, అన్నదాన హుండీ ద్వారా రూ.9,46,670... మొత్తం రూ.37,23,308 ఆదాయం సమకూరిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్ తనిఖీదారు వి.ఫణికుమార్, దేవస్థానం చైర్‌పర్సన్ మొయిళ్ల సంధ్య, తిరుపతి గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక


అంబాజీపేటలో ఎంపికైన క్రీడాకారులు

అంబాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14 బాలుర, అండర్ -17 బాలికల ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్లను ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కె.ఈశ్వరరావు తెలిపారు. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మంగళవారం పరిశీలించారు. ఆర్ ఎస్ కుమార్, తోట రవి, ముత్యాల కిషోర్ జయరామ్, కుంపట్ల ఆదిలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన జట్ల ఎంపికకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి 154 మంది బాలురు, 31 బాలికలు పాల్గొన్నారు. వారిలో అండర్-14 బాలుర, అండర్-17 బాలికల క్రికెట్ జట్లను ఎంపిక చేశామన్నారు. వీరు త్వరలో గుంటూరులో జరిగే స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారని ఈశ్వరరావు తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సలో...

చోటు దక్కించుకున్న కాట్రేనికోన విద్యార్థి


కుషాల్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్ నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని 195 దేశాల పేర్లు, వాటి రాజధానుల వివరాలను కేవలం 2 నిమిషాల 59 సెకన్ల 11 మిల్లీ సెకన్లలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విత్తనాల కుషాల్‌నాగవెంకట్ చోటు దక్కించుకున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కాట్రేనికోన గ్రామానికి చెందిన కుషాల్ కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూలులో మూడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను కలెక్టర్ మహేష్‌కుమార్ కుశాల్‌కు అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఢిల్లీ పబ్లిక్ స్కూలు డైరెక్టర్ నంధ్యాల మనువిహార్, కోఆర్డినేటర్ వర్ధిని పాల్గొన్నారు.

14న ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

ముమ్మిడివరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈనెల 14న జరగనున్న ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఏఐటీయూసీ కోనసీమ జిల్లా సమావేశంలో సత్తిబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్మిక సంఘాల రెన్యువల్స్‌ను పూర్తిచేయాలని, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల జిల్లా మహాసభలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. కార్మిక సమస్యలపై వారు చర్చించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు, సబ్‌కమిటీ సభ్యుడు రాము పెద్దిరెడ్డి, శీలం వెంకటేష్, యు.వెంకటేష్, బండి సత్యనారాయణ, మోకా శ్రీనివాసరావు, బొలిశెట్టి గౌరీశంకర్, సంపర సుధ, బుంగా కుమార్, వనచర్ల విజయ్‌కుమార్, భవన నిర్మాణ కార్మికసంఘాల సభ్యులున్నారు.

భార్యను కాపురానికి పంపడంలేదని కత్తితో దాడి

తల్లీ, కూతుళ్లకు గాయాలు

ఏలేశ్వరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన భార్యను కాపురానికి పంపడంలేదనే ఆగ్రహం చెందిన ఓ వ్యక్తి తల్లీకూతురిపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం ఎదురుపాక గ్రామానికి చెందిన పెంటకోట హరిబాబుతో కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామానికి చెందిన రామకుర్తి సూరిబాబు అప్పలరాజుల రెండో కుమార్తె దుర్గాదేవిని ఇచ్చి వివాహం చేశారు. పెద్ద కుమార్తె నాగ దుర్గా సాయికి తిరుమాలికి చెందిన మణికంఠ స్వామితో వివాహం జరిగింది. ఏడాది కాలం నుంచి దుర్గాదేవి, హరిబాబు సంసారంలో కలతలు రేగాయి. అప్పటి నుంచి దుర్గాదేవి తన తల్లి ఇంటి వద్దే ఉండిపోతుంది. భార్యకు నచ్చచెప్పి తమతో పంపడంలేదని హరిబాబు ఆగ్రహంతో పించను కోసం తిరుమాలి వచ్చిన అత్త అప్పలరాజుపై దాడి చేశాడు. తప్పని అడ్డుకున్న వదినపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో తీవ్రంగాగా యపడిన అప్పలరాజును, స్వల్పంగా గాయపడిన నాగ దుర్గా సాయిని స్థానికులు ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును ఎస్‌ఐ రామలింగేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సూర్య అప్పారావు తెలిపారు. హరిబాబును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడించారు.


ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లీ,కూతురు

నమో నారసింహ..

అంతర్వేదిలో వైభవంగా మహాశాంతి హోమం

వేలాదిగా పాల్గొన్న భక్తులు


మహాశాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు


హోమం కోసం స్వామివారిని తీసుకెళ్తున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే శ్రీకర శుభకర ప్రణవస రూపుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి. ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ నేపథ్యంలో రాజోలు నియోజకవర్గాన్ని, అంతర్వేది పరిసర ప్రాంతాలను కాపాడిన సందర్భంగా అంతర్వేదిలో మంగళ వారం మహాశాంతి హోమం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామికి భక్తి శ్రద్ధలతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కూటమి శ్రేణుల నేతృత్వంలో హోమాన్ని చేపట్టారు. అశేష భక్తజన సంద్రంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, అయ్యప్పస్వాములు, భవానీ మాలధరించిన భక్తులు, క్షేత్రానికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు కాలినడకన పుణ్యక్షేత్రానికి చేరుకుని స్వామివారికి పాదాభివందనాలు చేస్తూ మొక్కారు. తొలుత స్వామిని అర్చకులు, ఆలయ అధికారులు శాస్త్రోక్తంగా ప్రధాన గోపురం ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక హోమశాలలో శాంతి హోమాన్ని నిర్వహించి నృసింహ, గోవింద నామస్మరణల మధ్య మహశాంతి హోమం, పూర్ణాహుతి వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహుదూర్, ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ పూర్ణాహుతిలో పూజా ద్రవ్యాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. తూర్పు, పశ్చిమ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు మహాశాంతిహోమాన్ని తిలకించారు. పూజా ద్రవ్యాలు హోమ గుండంలో వేసి స్వామిని దర్శించుకున్నారు. ఇంతటి మహోన్నతమైన కార్యక్రమం కార్తీకమాసంలో చేపట్టడంతో హర్షం వ్యక్తం చేసి నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, కేతా వెంకటలక్ష్మి, ఆకన బాబ్జినాయుడు, పినిశెట్టి బుజ్జి, మాలే శ్రీనివాసనగేష్, గుబ్బల ఫణికుమార్, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, బైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, తిరుమాని ఆచార్యులు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, పోతురాజు కిశోర్, ఒడుగు శ్రీను, ఎంపీటీసీలు చొప్పల బాబూరావు, బైరా నాగరాజు, దాసరి వాసు, పిండి సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి పాల్గొన్నారు.

స్టడీ రూంలో విద్యార్థి ఆత్మహత్య!

తునిలో కలకలం రేపిన సంఘటన


కార్తీక (ఫైల్)

తుని రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి మృతి చెందడం కలకలం రేపింది. తునిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తుని మండలం లోవ కొత్తూరు పంచాయతీ సీతయ్యపేట గ్రామానికి చెందిన కొండ్రు కార్తీక్ (15) సోమవారం రాత్రి స్కూల్ మేడ ఉన్న స్టడీ రూంలో ఉరేసుకుని మృతి చెందాడని విద్యార్థి తల్లిదండ్రులకు యాజమాన్యం సమాచారం అందించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా తుని పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. స్కూల్ సిబ్బంది, స్టడీ రూమ్ అబ్జర్వర్‌తో మాట్లాడారు. సోమవారం సాయంత్రం వరకు కార్తీక అందరితోను సరదాగానే గడిపాడని... సాయంత్రం గదిలోనే ఉండిపోయాడని, స్టడీ అవర్‌కు రాలేదని కార్తీక స్నేహితులు, పాఠశాల యాజమాన్యం తెలిపినట్టు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో ఏం జరిగిందో అనే దానిపై విచారణ చేపడుతున్నామని, విద్యార్థి మృతిని ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గీతారామకృష్ణ పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పరారీలో భర్త


దీనా (ఫైల్)

యానాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యానాం బల్లవారివీధిలో వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందింది. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన పెమ్మడి దీనా (26), భర్త నానీ గత 4 నెలలుగా బల్లవారివీధిలో అద్దెకుంటున్నారు. కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీనా ఇంట్లో టైలరింగ్ చేస్తుండగా భర్త నానీ పెయింటర్‌గా ఉన్నాడు. రోజూ ఉదయం ఇంటి మంచినీటి కుళాయి దీనా ఆన్ చేసేది. మంగళవారం ఉదయం6.30గంటలకు మంచినీటి మోటార్ వేయకపోవడంతో ఇంటి యాజమాని పనిమనిషినితో దీనాను నిద్ర లేపమని చెప్పింది. పనిమనిషి దీనా ఇంటి తలుపులు తోయగా దీనా రక్తపు మడుగులతో పడిపోయి ఉంది. పక్కనే దీన కుమార్తె పడుకుని ఉంది. వెంటనే సమీప రాజీవ్‌నగర్‌లో ఉంటున్న దీనా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతిచెందిదని వైద్యులు ధ్రువీకరించారు. సంఘటనా స్థలాన్ని యానాం ఎస్పీ వరదరాజన్ పరిశీలించారు. ఎస్‌ఐ పూనిత్‌రాజా, కట్టాసుబ్బరాజు, క్లూస్‌టీంతో సంఘటనకు గల కారణాలను సేకరిస్తున్నారు. దీనాకు కుమార్తె 1వతరగతి చదువుతోంది. దీనా భర్త పరారీలో ఉన్నాడు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. పెయింటర్ మృతి

మరొకరికి తీవ్రగాయాలు

మండపేట మండలం ద్వారపూడి శివారులో ఘటన


మరణించిన సూరిబాబు

మండపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లి కాలనీ వద్ద మంగళవారం ఆటో బైక్‌ను ఢీ కొన్న ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మరణించగా మరో వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. మండపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన ఇందల దుర్గా సూరిబాబు (28) భవనాలకు పెయింటింగ్‌లు వేస్తుంటాడు. రాజానగరం మండలంలో నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం ఇంటి నుంచి తన పల్సర్ బైక్‌పై సహచరుడు రాజుతో కలిసి పెయింటింగ్ పని నిమిత్తం బయలుదేరాడు. ఇప్పనపాడు వస్తుండగా ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లి కాలనీ శివారు దూకుడు మెట్ట వద్దకు వచ్చేసరికి వేములపల్లి వైపు నుంచి రాజానగరం వైపు వెళ్తున్న ఆటో బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై నుంచి కిందకు పడిపోయిన సూరిబాబు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. సూరిబాబు భార్య ఇందల జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మండపేట రూరల్ స్టేషన్ ట్రైనీ ఎస్‌ఐ సోమేంద్ర తెలిపారు. సూరిబాబు మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేస్తామని పేర్కొన్నారు.

గిరిజన ఆశ్రమ విద్యార్థిని అదృశ్యంపై కేసు


గంగాభాయ్

మారేడుమిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని పల్లాల గంగబాయ్ పాఠశాలలో అదృశ్యమైంది. ఉపాధ్యాయులు మారేడుమిల్లి సీఐకు టి.గోపి నరేంద్ర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. గంగాభాయ్ మారేడుమిల్లి మం దలం చావడికోట పంచాయతీ చావడ కోట గ్రామం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పింఛన్‌కు వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడి...

దివ్యాంగుడి మృతి

ప్రత్తిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పింఛన్ కోసం వచ్చి దివ్యాంగుడు మిగత జీవుడుగా మారాడు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు బుద్దారపు శ్రీను (33) హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీ వద్ద సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. ప్రతి నెలా వచ్చే తన దివ్యాంగ పించను కోసం పెద్దిపాలెం వస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1న పెద్దిపాలెం వచ్చి పించను అందుకున్నాడు. అనంతరం బంధువుల ఇంటి వద్ద ఉండి స్థానిక ఏలేరు ఎడమ కాలువ వద్దకు సోమవారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మునిగిపోయాడు. మంగళవారం ఉదయం మృతదేహం తేలడంతో స్థానికులు ప్రత్తిపాడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ లక్ష్మీకాంతం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో దూకిన యువతి


కళ్యాణి (ఫైల్)

యానాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యానాం ముఖద్వారం వద్ద గల యానాం-నీలపల్లి వంతెనపై నుంచి మంగళవారం రాత్రి గోదావరిలోకి యువతి దూకింది. పోలీసుల వివరాల మేరకు.. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలోని జార్జిపేట పంచాయితీ తూర్పుపేటకు చెందిన సిరపు కళ్యాణి(25) తాళ్లరేవులో ఓ కిరాణా కొట్టులో పనిచేస్తుంది. తాళ్లరేవు నుంచి వచ్చిన ఆమె స్థానిక వంతెనపైకి చేరుకుని అక్కడ పర్సు, ఫోన్ వదిలి గోదావరిలోకి దూకింది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

గోదావరి హారతి వేదిక మార్పు

సామర్లకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం నిర్వహించే గోదావరి హారతి వేదికను మార్పు చేసినట్టు భీమేశ్వరస్వామి దేవస్థానం ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. గోదావరి జలాల కాలుష్యం కారణంగా గోదావరి పుష్కరిణి లో ఇచ్చే హారతిని ఆలయ కోనేరులో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపిక

గొల్లప్రోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బెంగళూరులోని ఇండస్ట్రియల్ టెక్నలజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో దక్షిణ భారత సైన్స్ డ్రామా జిల్లా స్థాయి పోటీల్లో 22 పాఠశాలల నుంచి టీములు పాల్గొన్నాయి. ఇందులో గొల్లప్రోలు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.5వేల నగదు పురస్కారం అందుకున్నారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. విద్యార్థులను, గైడ్ టీచర్ భారతిని ఎంఈవోలు వెన్నా శ్రీనివాస్, వెంకట శివప్రసాద్, హెచ్ఎం రాజ్యలక్ష్మి అభినందించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో-1 రంగారావు

'నైపుణ్యాభివృద్ధితో ఉజ్వల భవిష్యత్తు'

సర్పవరం జంక్షన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో-1 తుమ్మల సత్య రంగారావు పేర్కొన్నారు. మంగళవారం రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో హెచ్ఎం సత్యవేలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐటీ కంప్యూటర్స్, ఫుడ్ ప్రొసెసింగ్, ఆటోమోటివ్ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయి స్కిల్ కాంపిటేషన్ పోటీలను ఆయన ప్రారంభించారు. వారు రూపొందించిన ఐటీ, ఫుడ్ ప్రొసెసింగ్, ఆటోమోటివ్ ప్రదర్శనలను తిలకించారు. ఒకేషనల్ టీచర్లు అలెక్స్ గణేష్, స్టెసీ, స్కూల్ ఇన్‌చార్జి యూవీవీ సత్యనారాయణ, చామంతి నాగేశ్వరరావు, కందుకూరి పాల్‌రాజు, కృష్ణవేణి, శంకరప్రసాద్, విజయలక్ష్మి, రామలక్ష్మి, అన్నపూర్ణ, జగదీష్, 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను పారిశుధ్య కార్మికులకే ఇవ్వాలి: ఇన్చార్జి కమిషనర్ సుధాకర్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెత్తను రోడ్లపై వేయవద్దని కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనరు కేటీ సుధాకర్ కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు వారికి మాత్రమే ఇవ్వాలని సూచించారు. మంగళవారం ఆయన రామకృష్ణారావుపేట, సూర్యనారాయణపురం, దేవాలయం, మెయిన్ రోడ్ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. సినిమా రోడ్డులోని సంతచెరువు పార్కులో నెలకొన్న సమస్యలపై అందిన ఫిర్యాదు మేరకు అక్కడకు వెళ్లారు. పార్కులో చెత్తను తీయట్లేదని, చెరువు నీటితో దుర్గంధం వ్యాప్తిచెందుతోందని వాకర్లు కమిషనరుకు వివరించారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అక్కడకు సమీపంలో వున్న అన్న క్యాంటీన్ వద్దకు వెళ్లి ప్రజలకు అందిస్తున్న అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. రామకృష్ణారావుపేటలో కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగునీటి సాంద్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాకినాడను క్లీన్ సిటీగా తీర్చిద్దడంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, వాటర్‌వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణ, శానిటేషన్ సూపర్‌వైజరు రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పురమిత్ర యాప్‌ను నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనరు కేటీ సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలన్నారు. తద్వారా పౌరులు ఇంటి వద్ద నుంచే పలు ప్రభుత్వ సేవలను పొందవచ్చని, సమస్యలు, ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు.

ఖాళీ స్థలాలకు పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖాళీ స్థలాలకు పన్ను వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించినట్టు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన గైగోలుపాడు, కరణంగారి సెంటర్‌లలో పర్యటించి పర్యటించి ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను చూశారు. కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు పన్ను చెల్లించని ఖాళీ స్థలాలను ఇప్పటికే గుర్తించామన్నారు. వాటి యజమానులు ఈ నెల 25వ తేదీలోపు పన్ను తప్పనిసరిగా చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఆ స్థలాలను 22 (ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సర్పవరం జంక్షన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన 33 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.20లక్షలు మంజూరయ్యాయని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి తెలిపారు. తమ పార్టీ కార్యకర్తలను లబ్ధిదారుల ఇళ్లకు పంపి వారితో చెక్కులు పంపిణీ చేయించామన్నారు.



గొల్లప్రోలు, పెద్దాపురంల్లో మండల స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులు

చెకుముకి సైన్స్ సంబరాలు

గొల్లప్రోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం చెకుముకి పట్టణ, మండల స్థాయి సైన్స్ సంబరాలు జరిగాయి. ప్రశ్నపత్రాలను ఎంఈవోలు వెన్నా శ్రీనివాస్, బి.వెంకటశివ ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల సీనియర్స్ విభాగంలో వన్నెపూడి, ఏకే మల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాలలు, జూనియర్స్ విభాగంలో తాటిపర్తి, గొల్లప్రోలు బాలుర ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల సీనియర్స్ విభాగంలో చేబ్రోలు గౌతమి ఇంగ్లిషు మీడియం స్కూలు, గొల్లప్రోలు మాధురి విద్యాలయ, జూనియర్స్ విభాగంలో చేబ్రోలు గౌతమి ఇంగ్లిషు మీడియం స్కూలు, గొల్లప్రోలు మనీషా విద్యాలయం విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలకు ఎంపీడీవో సెలట్‌రాజు, జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు వి.సత్యనారాయణరెడ్డి, దాడి పద్మనాభం బహుమతులు అందించారు. చెకుముకి టాలెంట్ టెస్టు కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు, జేవీవీ అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరెడ్డి, ఎంవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోటరీ క్లబ్ ఆవరణలో జేవీవీ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 31 పాఠశాలల నుంచి 152 మంది విద్యార్థులు హాజరుకాగా విజేతలకు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ పెద్దాపురం, సామర్లకోట శాఖల అధ్యక్షుడు తటవర్తి సత్యనారాయణ, కార్యదర్శి గంగాధరుడు, చౌదరి, బుద్దా శ్రీనివాస్, కృష్ణమూర్తి, బాలాజీ, శివశంకర్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో జగన్ ఎప్పుడైనా పర్యటించారా

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ ధ్వజం



కాకినాడ సిటీ, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): విపత్తుల సమయంలో గాలిలో తిరగడం తప్ప జగన్ ఎప్పుడైనా పర్యటించారా, మంత్రిగా కన్నబాబు, సీఎంగా జగన్ రాష్ట్రానికి ఏమి వెలగబెట్టారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ధ్వజమెత్తారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి కన్నబాబు, వైసీపీ నేతల వ్యాఖ్యలను ఖండించారు. మొంథా తుఫాన్ వల్ల ప్రాణనష్టం జరగకుండా చంద్రబాబు ప్రభుత్వం అప్రమత్తం చేసిందన్నారు.



వృద్ధులకు పళ్ల సెట్లకు కొలతలు తీసుకుంటున్న వైద్యులు

పిఠాపురంలో మెగా దంత వైద్య శిబిరం

పిఠాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో మంగళవారం ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ వైద్య కళాశాల, నియో సంస్థల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రెండు నెలలుగా మెగా దంత సర్వే నిర్వహించారు. అందులో గుర్తించిన 75మంది వృద్ధులకు పళ్ల సెట్లు అమర్చేందుకు వైద్యులు కొలతలు తీసుకున్నారు. జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, నియో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ బుర్రా దివ్యరాజ్, కో-ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా ఆర్ఎస్ఎస్ శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని గోదావరి విభాగ కుటుంబ ప్రబోధన్ ప్రతినిధి రామచంద్రరావు ఇంటింటి ఆర్ఎస్ఎస్ సందేశాన్ని చేరవేసే కరపత్రాలను వైద్యులకు అందజేశారు.

'ఆదిత్య' పాలిటెక్నిక్ కళాశాల సందర్శన

సామర్లకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో పేర్కొన్నారు. మంగళవారం పాఠశాల వృత్తివిద్య విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో ఐటీ విభాగం, ఆటోమొబైల్ ట్రేడ్‌లను సందర్శించింది. అక్కడి అధ్యాపకులు వివిధ అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఎస్వీవీఎస్ కుమార్, డీన్ ఎ.మాధవరావు, వృత్తి విద్య ఫ్యాకల్టీలు జి.జ్యోతి, వి.ఆదిత్య, ఎన్.హరనాథ్, సీహెచ్ బబిత, జి.బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో సఖి-సురక్ష శిబిరం

సామర్లకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ మెప్మా ఆధ్వర్యంలో కమిషనరు శ్రీవిద్య ఆధ్వర్యంలో పట్టణంలోని రైతు భవన్ ఆవరణలో మంగళవారం ఏర్పాటుచేసిన సఖి-సురక్ష శిబిరాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన డాక్టర్ వశిష్ట, ఇతర వైద్యులు 600 మంది డ్వాక్రా మహిళలకు క్రానిక్ డిసీజెస్, కార్డియో వస్కులర్ రిస్క్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ తదితర 16 రకాల పరీక్షలు నిర్వహించారు. మెప్మా సీఎంఎం సయ్యద్ హుస్సేన్, మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ, కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, పిల్లాడి సత్యవతి, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, గుమ్మళ్ల రామకృష్ణ, అందుగుల జార్జిచక్రవర్తి, గొలితి సత్యనారాయణ, సరోజావాసు, బొందల రామలక్ష్మి, కంచర్ల సుష్మామోహిని తదితరులు పాల్గొన్నారు.



సఖి-సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

మత్స్యకార కుటుంబానికి రూ.లక్ష సహాయం

కాకినాడ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద బోట్లను తాళ్లతో కడుతూ అలల తాకిడికి సముద్రంలో కొట్టుకుపోయి మరణించిన దుమ్ములపేటకు చెందిన మత్స్యకారుడు గద్దేపల్లి సాయిరాం కుటుంబానికి బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఆయన పంపిన నగదును యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు కుక్కల పోతురాజు యాదవ్ సాయిరాం కుటుంబానికి అందజేశారు. బీసీ నాయకులు గొంప శివకుమార్, శీరం శ్రీను, ఆర్‌కే రామకృష్ణ, గొర్ల కుమార్, ముల్లె రాజు, సబ్బి శ్రీను, దాసరి సతీష్ పాల్గొన్నారు.



సాయిరాం కుటుంబానికి రూ.లక్ష నగదు అందజేస్తున్న యాదవ సంఘ నాయకులు

మత్స్య శాఖ జేడీ కృష్ణారావుకు సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో మత్స్యకారులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న మత్స్య శాఖ జేడీ వి.కృష్ణారావును జిల్లా మత్స్యకార సంఘాల నాయకులు సత్కరించారు. ఏటిమొగలోని మత్స్య శాఖ జేడీ కార్యాలయంలో ఆయనకు ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. నాయకులు బలసాడి నారాయణరావు, చింతా వీర్రాజు, ఎం.నటరాజు, ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు.



జేడీ కృష్ణారావుకు శాలువా కప్పి సత్కరిస్తున్న మత్స్యకార సంఘ జిల్లా నాయకులు

'మడ అడవులను ఆక్రమిస్తున్న రియల్టర్లపై చర్యలు తీసుకోవాలి'


కాకినాడ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ సర్వే నెం.218లో మడ అడవులను ఆక్రమిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. నగరం లోని సుందరయ్య భవన్‌లో మంగళవారం సీపీఎం కాకినాడ రూరల్ మండల కమిటీ సమావేశం తొట్టిపూడి రాజా అధ్యక్షతన జరిగింది. రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ 14 ఎకరాల్లో విస్తరించిన మడ అడవులు, రెండు ఎకరాల్లో చిత్తడి నేలలను ఆక్రమించి కట్టడాలు కడుతున్నారన్నారు. ఈ భూములు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జడ్) పరిధిలోకి వస్తున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్, మండల కమిటీ సభ్యులు చింతపల్లి అజయ్‌కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, సీహెచ్ విజయ్‌కుమార్, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రాస్తారోకో

పెద్దాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జె.తిమ్మాపురం, కాట్రావులపల్లి జంక్షన్ వద్ద బస్సులు ఆపట్లేదంటూ విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. దీంతో తాము చాలా ఇబ్బందిపడుతున్నామన్నారు. రాస్తారోకోతో గంటసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక నాయకులు ఆర్టీసీ అధికారులతో మాట్లాడగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'రేషన్ దుకాణాల వద్ద డిస్‌ప్లే ఏర్పాటు చేయించాలి'

కరప, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి రేషన్ దుకాణం వద్ద ప్రధాని మోదీ స్టిక్కర్, ఉచిత బియ్యం పంపిణీ వివరాల డిస్‌ప్లే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ కరప మండల ఇన్‌చార్జి తుమ్మలపల్లి నాని డిమాండ్ చేశారు. మంగళవారం కరపలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షురాలు వై.పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆత్మనిర్భర్ భారత్-సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్టిక్కర్లు, కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అక్టోబరు 26 నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం డీలర్లను ఆదేశించినా కొన్ని గ్రామాల్లో పంపిణీ జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత రేషన్ బియ్యం, ప్రధాని మోదీ ఫొటోతో కూడిన ఫ్లెక్సీలను రేషన్ షాపుల వద్ద ఏర్పాటు చేయించాలని ఆదేశించినా పట్టించుకోవట్లేదన్నారు. ఈ విషయమై తహసీల్దారు దుర్గాప్రసాద్, ట్రైనీ కలెక్టర్ మనీషాలకు వినతిపత్రం అందించారు. నాయకులు పుట్టా వీరప్రసాద్, అప్పనపల్లి త్రిమూర్తులు, రెడ్డి రమేశ్వర్, నల్ల వెంకటేశ్వరరావు, పెమ్మాడి నాగేశ్వరరావు, గోవిందరాజులు, వీరబాబు, గోపిశెట్టి సుబ్బలక్ష్మి, జానకమ్మ, మంగయ్యమ్మ, వెంకటేష్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



ట్రైనీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి నాని

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కొత్త లే-ఔట్లలో ఉన్న 11 కేవీపీ ఈటీసీ ఫీడర్, సత్యనారాయణపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్డీఎస్ ప్రభాకర్ తెలిపారు. సామర్లకోట కొత్త లే-ఔట్స్ ఏరియా, వ్యవసాయవసర విద్యుత్ సర్వీసులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన చెప్పారు.



బండారు శ్యామలామణి, గుర్రం హేమలత

రాష్ట్రస్థాయి డిస్కస్‌త్రో పోటీలకు శ్యామలామణి ఎంపిక

గొల్లప్రోలు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి డిస్కస్‌త్రో పోటీలకు తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని బండారు శ్యామలామణి ఎంపికైంది. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో కాకినాడ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుంది. శ్యామలామణిని హెచ్ఎం నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మరాజు, స్వాతి అభినందించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుర్రం హేమలత జిల్లా స్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. ఆమెను పీడీలు నర్రాల శ్రీహరి, తోట వెంకటరాజు, గారపాటి శ్రీను, వరహాలు, హెచ్ఎం ప్రకాష్, విద్యా కమిటీ ప్రతినిధులు అభినందించారు.



లస్కర్లకు రెయిన్‌కోట్లు అందజేత

పిఠాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్, ఏలేరు వరదల సమయంలో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది సమర్థంగా పనిచేశారని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. తుఫాన్‌ను ఎదుర్కోవడంలో బాగా పని చేసిన పీబీసీ పరిధిలోని 14 మంది లస్కర్లకు పిఠాపురంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో రెయిన్‌కోట్లు అందజేశారు. కోటిపల్లి, కాజులూరు, సిరిపురం, ఎర్రపోతవరం, కొమరిపాలెం, కాకినాడ, రామచంద్రపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లు విజయగోపాలరాజు, లాకాని కృష్ణచైతన్య, పేపకాయల నారాయణరావు, సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, వేణుగోపాలరెడ్డి, కొప్పిరెడ్డి వీరాస్వామి, సత్యానందరెడ్డి, ఇరిగేషన్ డీఈఈ సంతోష్‌కుమార్, ఏఈఈలు పద్మజ, భవానీ, ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టం గుర్తింపు

గండేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాను కారణంగా కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగి రైతు లకు భారీ నష్టాలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటల నష్టాలను గుర్తించారు. మండలంలో 190 హెక్టారుల్లో వరి, 176 ఎకరాల్లో మినుము పంటలకు నష్టం వాటిలినట్లు గుర్తించినట్లు మండల వ్యవసాయ అధికారి జె.లక్ష్మి తెలిపారు. మినుముకు హెక్టా రుకు రూ.15వేలు, వరికి రూ.25వేలు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వస్తుందని ఆమె తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

రంపచోడవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంజా దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక మార్క్స్‌ఏంగిల్స్ భవనంలో ఏఐకేఎంఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఐ.వీ.రమణ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దూలయ్య మాట్లా డుతూ సీఎం చంద్రబాబు రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను కలుపుతూ ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తానని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం జిల్లా సాధన కమిటీ నాయకుడు బాలు అక్కిస, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు మడకం బంగారుబాబు, పీఠ ప్రసాద్, వెదుళ్ల లచ్చిరెడ్డి, పల్లాల ఆదిలక్ష్మి, అన్నిక పండమ్మ, మడకం గోవింద్, కత్తుల బాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులు ఏర్పాటు చేయాలి



గుంతలతో ఉన్న కాకవాడ-చెలకవీధి రహదారి

రంపచోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకొండ పంచాయతీ గ్రామాల్లో పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు బచ్చల శ్రీదేవి విమర్శించారు. గ్రామాలకు రోడ్లు మంజూరైనప్పటికీ నేషనల్ పార్కు పేరుతో అటవీశాఖ అనుమతులు లేక పనులన్నీ ఆగిపోయాయన్నారు. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ లో ఐటీడీఏ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికి పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్. విజయభాస్కర్ రెడ్డి, కళ్యాణి, కుర్లా రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను వినియోగించుకోండి



డాక్టర్ షమీమ్

కూనవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోతులగుట్ట సీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన ఆయుర్వేద ఆసుపత్రిని వినియోగించుకోవాలని ఆయుర్వేద వైద్యురాలు బీఏఎంఎస్ షమీమ్ కోరారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు ఇస్తామన్నారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు.



చెకుముకి సైన్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


చెకుముకి సైన్సు సంబరాలు

దేవీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇందుకూరుపేట జడ్పీహెచ్‌ఎస్‌లో మండలస్థాయి చెకుముకి సైన్సు సంబరాలను మీఈఐ త్రిమూర్తులు, ప్రధానోపాధ్యాయులు ముత్యాల రావు నిర్వహించారు. మండలంలోని నాలుగు హైస్కూల్స్‌కి చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహించగా ప్రథమస్థానం జీటీడబల్‌యుఏజీహెచ్‌ఎస్ దామనపల్లి విద్యార్థులు గెలుపొందగా, వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, రిటైర్డ్ ఉపాధ్యాయులు జనక్ విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో యుటీఎఫ్ అధ్యక్షులు కె.శ్రీనివాస్‌దొర, ప్రధాన కార్యదర్శి కె.చిన్నిబాబు, మహిళా కార్యదర్శి కె.సితిరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

దేవీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అక్రమ షాపింగ్ కాంప్లెక్స్ పై ఎల్‌టీఆర్ కేసు నమోదు చేయాలని రంపచోడవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్‌కు ఫిర్యాదు చేసినట్లు మంగళవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను ప్రకటనలో తెలిపారు. ఇందుకూరు గ్రామానికి చెందిన కామిశెట్టి వీరబాబు తండ్రి సత్యనారాయణ ఏజెన్సీలోని 1/70 చట్టాన్ని ఉల్లఘించి అక్రమ కట్టడాన్ని నిర్మించి వ్యాపారం చేస్తున్నారని తక్షణమే దాన్ని తొలగించాలన్నారు.

ముసురుమిల్లిలో 'బిర్సా' జయంతి



బిర్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రంపచోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముసురుమిల్లిలో బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వంశీ కుంజం, బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రాంబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రోషిణి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

10న ఐటీడీఏ ముట్టడి

రంపచోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో మాతా, శిశు వరుస మరణాల బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 10న ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. మంగళవారం ఆయన నరసాపురంలో ఇటీవల వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన కోటం బాపనమ్మ సంతాప సభలో మాట్లాడారు. ఏరియా ఆసుపత్రిలో అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా నాలుగు నెలల్లో నాలుగు మరణాలు సంభవించాయన్నారు. మాతా, శిశు మరణాల కారకులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఐటీడీఏ ముట్టడికి ఆదివాసీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తీగల బాబురావు, మోడిద నూకరాజు, చోడి ప్రదీప్ కుమార్‌దొర తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ధర్మేంద్ర బాధ్యతల స్వీకరణ

కూనవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కూనవరం తహసీల్దార్‌గా ధర్మేంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన కూనవరం తహసీల్దార్ శ్రీనివాస్‌ఎటపాక మండలానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ధర్మేంద్ర నియమితులయ్యారు.

మండలాధ్యక్షుడు పుల్లయ్యకు సత్కారం



పుల్లయ్యను సన్మానిస్తున్న టీడీపీ కార్యకర్తలు

ఎటపాక,నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఎటపాక టీడీపీ నూతన మండలాధ్యక్షుడిగా ఎన్నికైన గన్నవరం గ్రామానికి చెందిన బొల్లా పుల్లయ్యను మంగళవారం స్థానిక టీడీపీ కార్యకర్తలు, శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మండలాధ్యక్షుడు పుల్లయ్య మాట్లాడారు. ఈకార్యక్రమంలో ములిశెట్టి శ్రీమన్నారాయణ, ఏసుపాక వెంకట్, ఏసుపాక చిన నరసింహారావు, దాసరి శ్రీకాంత్, కొప్పుల శివయ్య, ఏసుపాక బాస్కర్‌రావు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

స్వర్ణ జగ్గంపేటగా తీర్చిదిద్దాలి

● జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి ప్రణాళిక కార్యాచరణ సిబ్బంది కలిశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రామ దత్తతపై విశ్లేషణ చేయడం జరిగింది. అందులో భాగంగా మల్లిసాల గ్రామాన్ని ఎమ్మెల్యే నెహ్రూ సూచనల మేరకు ఎంపిక చేశారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతులు, విభాగాల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. మొదటిగా అంగన్‌వాడీ సెంటర్లను అభివృద్ధి పరచాలని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ పరిధిలోగల పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, విద్యావేత్తలు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించి స్వర్ణ జగ్గంపేటగా తీర్చిదిద్దాలని నెహ్రూ పిలుపు నిచ్చారు. జగ్గంపేట అభివృద్ధి ప్రణాళిక అధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ, యంగ్ ప్రొబిషన్ విజయ్ కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు పాల్గొన్నారు.



నెహ్రూను కలిసిన అభివృద్ధి ప్రణాళిక సిబ్బంది

న్యాయవాది చాంబర్ ప్రారంభం

స్థానిక గోకవరంరోడ్‌లోని శివపార్వతి ఫంక్షన్ హాల్‌వద్ద న్యాయవాదులు వేగిభద్రం, గవర సుధాకర్, బలబద్ధుని కామేష్ ఏర్పాటుచేసిన న్యాయవాది చాంబర్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. జనసేన జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. హాస్టల్ విద్యార్థులకు న్యాయవాదులు ఏర్పాటుచేసిన పాదరక్షలు పంపిణీ చేశారు. ఎస్వీఎస్ అప్పలరాజు, పాండ్రంగి రాంబాబు, పైడిపాల సూరిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన వినాయక్ వర్మ

స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సంపరాస్ మల్టీ కాంట్రాక్టర్ ప్రైవేట్ సంపరాస్ ఏసియా లిమిటెడ్ అధినేత సంపర సుధాకర్ వినాయక్ వర్మ జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్యదర్శి వీరలక్ష్మికి యనమల అభినందన



కార్యదర్శి వీరలక్ష్మిని అభినందిస్తున్న యనమల

తుని రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి మంగపు వీరలక్ష్మిని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అభినందించారు. తొండంగి మండలం కొత్తపెరుమళ్ళపురం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వీరలక్ష్మి తుఫాన్ సమయంలో ఉత్తమ సేవలు అందించడంతో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆమెకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతులమీదుగా మొంథాతుఫాన్ ఫైటర్ సేవా పురస్కారాన్ని అందజేశారు. వీరలక్ష్మి మంగళవారం తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమలను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, ఏపీ ఎన్జీవో మండల అధ్యక్షుడు టీవీ సత్యనారాయణ ఉన్నారు.

విప్లవ అమరవీరుల సంస్మరణ సభ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జెడ్.రాగంపేట గ్రామంలో సీలింగ్ భూమిని ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. జెడ్. రాగంపేట ఎస్సీ పేటలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీడీఎస్‌యూ(వి), ప్రగతి మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విప్లవ అమరవీరుల సంస్మరణ సభ ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా నాయకులు కె.రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. వీరాంజనేయులు హాజరై మాట్లాడారు. ముందుగా గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

శివ, అయ్యప్ప స్వాములకు అన్నదానం



రౌతులపూడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి శివాలయం ఆవరణలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శివస్వామి, అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యాదవ కాలనీకి చెందిన పంపనబొయిన శ్రీను, బాబ్జీ, గోవిందులు ఈకార్యక్రమం నిర్వహించారు. గుమ్మరేగుల, బీబీపట్నం, బంగారయ్యపేట, రౌతులపూడికి చెందిన స్వాములు పాల్గొన్నారు.

ధర్మవరంలో సాంబశివుడి ఊరేగింపు



ధర్మవరంలో భజనలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో గౌరీశంకర్ల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సాంబశివుడు ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు,మంగళవాయిద్యాలు, డప్పులు, శక్తివేషాలు తదితర నృత్యప్రదర్శనలతో సాంబశివుడిని గ్రామంలో ఊరేగించారు. స్థానిక కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద సప్తాహ మహోత్సవాల్లో భాగంగా భజనలు నిర్వహించారు. కుండల గోవిందు, సూర్యకళా దంపతుల ఆర్థిక సహాయంతో అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా నూకరాజునాయుడు ఆధ్వర్యంలో ధర్మవరం, వెల్లుర్తి, కాజులూరుకు చెందిన 8భజన సమాజాలు భక్తగేయాలు ఆలపిస్తూ భజనలు నిర్వహించారు.

'స్వదేశీ వస్తువులు వాడదాం'



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

కిర్లంపూడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమరాయణం పేట గ్రామంలో బుద్ధ సత్యనారాయణ ఇంటి దగ్గర బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ అధ్యక్షతన పార్టీ బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యులు, శక్తి కేంద్ర అధ్యక్షులతో పరిశీలించి కమిటీలు వేసి, సీనియర్ నాయకులను కలిశారు. స్వదేశీ వస్తువులు వాడదామని ప్రతిజ్ఞ చేసి, పార్టీ బలోపేతంపై చర్చించారు. అల్లు శివరామకృష్ణ, యడాలి రాంబాబు, కంట కాశీ విశ్వనాధం తదితరులున్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష

ప్రత్తిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద మంగళవారం చెకుముకిసైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మండల వ్యాప్తంగా హై స్కూల్/ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలు జన విజ్ఞాన వేదిక, మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో ప్రభుత్వ స్కూల్స్ జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి పెద్దిపాలెం జడ్పీహెచ్‌ఎస్, ద్వితీయ బహుమతి టి. రాయవరం స్కూల్ విద్యార్థులు సాధించగా సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి ఒమ్మంగి హై స్కూల్,ద్వితీయ బహుమతి చినశంకర్లపూడి హై స్కూల్,ప్రైవేట్ విభాగంలో జూనియర్స్‌లో ధర్మవరం ఆదర్శ విద్యాలయం, ద్వితీయ బహుమతి భారత విద్యానికేతన్‌లు , సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి ధర్మవరం ప్రతిభా . విద్యాలయం, ద్వితీయబహుమతి అఖిల్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు సాధించారు.వీరిలో మొదటి బహుమతి సాధించిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెకుముకి టాలెంట్ టెస్ట్ కన్వీనర్ ఎంవీ రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జాన్‌ప్రసాద్, యూటీఎఫ్ నాయకుడు కోడి శ్రీనివాసరావు,వీవీ రమణ, డి.రాజబాబు, చుక్కల గణేష్,సుంకర శ్రీనివాస్, రామలింగేశ్వరరావు, ప్రసాద్‌బాబు,ఎస్‌ఈ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'శ్రీ ప్రకాష్'లో యూకేజీ విద్యార్థులకు స్నాతకోత్సవం



విద్యాసంస్థల కార్యదర్శి విజయ్‌ప్రకాష్‌తో చిన్నారులు

తుని రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో 2024-25 విద్యాసంవత్సరంలో యుకేజీ విద్యార్థులకు స్నాతకోత్సవాన్ని సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ నిర్వహించారు. విద్యార్థులకు పట్టాలు అందించి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలతో కొంత సమయాన్ని గడపాలని దాని ద్వారా విద్యార్థులు ఆదర్శ వంతమైన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. భారత వికాస్ పరిషత్ సౌత్ జోన్ బృందగాన పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులను శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజరర్ చిట్టూరి రామతులసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జ్‌లు బి.ప్రసూనమౌళి, ఉషారాణి, భార్గవి, సునీత, డీఎల్‌పీ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్స వం సందర్భంగా జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావు ప్రారం భించారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్.మదీనా (తెలుగు), పి.రామకృష్ణ(హిస్టరీ), కె. సత్యనారాయణ (సివిక్స్) వ్యవహరించారు. వ్యాసరచనలో వై.ఎస్ఎస్.ప్రకా ష్, నేతృత్వంలో ఐ.ప్రకాష్, క్విజ్‌లో పి.నవీనను ప్రథమ శ్రేణి విజేతలుగా నిర్ణయించారు. 3 పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించిన విజేతలను ఈనెల 6న జరిగే జిల్లాస్థాయి పోటీలకు కళాశాల తరుపున ఎంపిక చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు.

స్వదేశీ వస్తువుల వినియోగంతో దేశ సమగ్రాభివృద్ధి



కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువుల వాడకం, వినియోగం ద్వారా దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెదిరెడ్డి రవికిరణ్ చెప్పారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల ఇన్‌చార్జ్ కందా వీరాస్వామి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బీజేపీ ప్రవాస్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశవ్యాప్తంగా స్వదేశీ వస్తువుల వినియోగం, వాడకంపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేపడుతున్నామన్నారు. ప్రత్తిపాడులోని ఇంటింటికి, ప్రతి దుకాణం వద్ద బీజేపీ నాయకులు తరలివెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్టా వెంకటరమణ, ఎస్.శ్రీనివాస్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు తేజోమూర్తుల ఉషారాణి, రామకృష్ణ, అడపా కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగ్గంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ప్రోత్సాహంతో స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ రాయుడు శ్రీను, మొదటి సంవ త్సరం కెమిస్ట్రీ విభాగం నుంచి వై.కృష్ణార్జున్, ఎం.దుర్గా ప్రసాద్ రెజ్లింగ్‌లో 57 కిలోల కేటగిరీ పోటీలకు హాజరయ్యారు. వై.కృష్ణార్జున్ మొదటి స్థానాన్ని (గోల్డ్ మెడల్), ఎం.దుర్గాప్రసాద్ తృతీయ స్థానాన్ని (బ్రాంజ్ మెడల్) సాధించారు. జనవరిలో చండీఘర్ (పంజాబ్)లో జరిగే జాతీయస్థాయిలో రెజ్లింగ్ పోటీల్లో కృష్ణార్జున్ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ తెలిపారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు, ఐ.క్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పీవీవీ సత్యానారాయణ పాల్గొన్నారు.

తుని నాయీబ్రాహ్మణ సంఘ చైర్మన్‌గా లవరాజు



లవరాజును సన్మానిస్తున్న దృశ్యం

కోటనందూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తుని నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సంఘం డెవలప్‌మెంట్ చైర్మన్‌గా కాకరాపల్లి గ్రామానికి చెందిన అల్లూరి లవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మేలుగపాటి నాగబాబు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈసందర్భంగా లవరాజు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చొప్పెళ్ల శ్రీను, సానపల్లి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ మండల నాయకులు గాడి రాజుబాబు, జావిరాజు, అంకంరెడ్డి రమేష్, బంటుపల్లి వెంకటేశ్వరరావు, వాసం నాగేశ్వరరావు, సామినీడి కృష్ణార్జున, వెలగా వెంకటకృష్ణారావు, లగుడు సత్యనారాయణమూర్తి తదితరులు అభినందించారు.

వరిలో తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



కోటనందూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వరిలో వచ్చే తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవశాయ శాఖ ఏడీ కేజీ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం బిళ్లనందూరు, ఎస్‌ఆర్‌పేట గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో తెగుళ్ల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఇండెక్స్‌కార్బ్ 14.5శాతం ఎస్‌సి మందును పిచికారి చేయాలన్నారు. అలాగే మాగుడు తెగులు నివారణకు ఎకరాకు 200 మిల్లీ లీటర్ల ప్రోపికోనాజోల్ పిచికారి చేయాన్నారు. ఏఈవో అప్పారావు, సురేస్, శివాజీ, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లిలో నిరుపయోగంగా మారిన ప్రభుత్వ కార్యాలయం

నిరుపయోగంగా ప్రభుత్వ కార్యాలయం

● పట్టించుకోని అధికారులు

గండేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరంపాలెంవెళ్లే రహదారిలో ఉన్న ప్రభుత్వం కార్యాల యాన్ని నిరుపయోగంగా వదిలేయడంతో భవనం చుట్టూ పెద్ద తుప్పలు పెరిగి చిట్టడివిలా మారింది. గతంలో ఆ భవనాన్ని కొద్దిరోజులు వ్యవసాయశాఖకి, మహిళా సమైక్య కేంద్రంగా ఉపయోగించారు. ప్రస్తుతం భవనాన్ని మెరుగుపరిచి ఏదొక ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించుకుంటే ప్రభుత్వ సొమ్ము ఆదా చేయవచ్చని పలువురు అంటున్నారు.

మల్లేపల్లిలో అన్నదానం



గండేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన అభయ ఆంజనేయస్వామి ఆలయంవద్ద మంగళవారం భక్తుల సహకారంతో ఆలయకమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాల స్వీకరించారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం



జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. తుమ్మలపల్లి రమేష్ హాజరై పేదలకు అన్నం వడ్డించారు. సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. కార్య క్రమంలో జగ్గంపేట టౌన్ అధ్యక్షులు గవర సుధాకర్, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మాదారపు వీరబాబు, జనసేన నాయకులు అంకం ఓం కృష్ణ, సత్తి సో మరాజు, గంధం శ్రీను, తుమ్మల మనోజ్, గోపాలపురం కనకరాజు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రత్తిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్ఐ లక్ష్మీకాంతం అన్నారు. స్థానిక నైపుణ్య కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలు సాధించుకోవాలన్నారు. మత్తుపదార్థాలు, సైబర్ నేరాల బారిన పడవద్దని సూచించారు. అనంతం ఎస్ఐను నైపుణ్య కళాశాల యాజమాన్యం శాలువా కప్పి సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరాముడి తెప్పోత్సవానికి సర్వం సిద్ధం

రౌతులపూడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మూలగపూడిలో గల శ్రీకోదండరాముని తెప్పోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. ప్రతి సవంత్సరం ఆలయ కమిటీ సభ్యులు కార్తీక పౌర్ణమి రోజున ఆలయం కింద గల చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. అలాగే స్వామి వారి సన్నిధిలో అఖండ జ్యోతిని వెలిగిస్తారు. అఖండజ్యోతి కోసం హైదరాబాద్ నుంచి కోటి ఒత్తులు తీసుకొచ్చి ఆలయంలో ఉంచారు.

గురుస్వామి జయంతి

ప్రత్తిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరం శివాలయంలో మంగళవారం దండపాణి గురుస్వామి 101వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు బొల్లు గంగాధర్, దాడి పుత్రయ్య ఆధ్వర్యంలో అయ్యప్పస్వాముల శరణఘోష మధ్య భక్తిశ్రద్ధలతో దండపాణి గురుస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

వాహనాలు వేగంగా నడపొద్దు

కోటనందూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం కోటనందూరులో ఆటో డ్రైవర్లతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుని-నర్సీపట్నం రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి, వాహనాలను నడపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు.